అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

● టీడీపీ నేత నారా లోకేష్‌కు ఎమ్మెల్యే శంబంగి సవాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: అటు రాష్ట్రంలో గానీ, ఇటు నియోజకవర్గంలో గానీ అభివృద్ధిపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని, మీరు గానీ, మీ నియోజకవర్గం నాయకులు గానీ సిద్ధమైతే దమ్ముంటే రావాలని టీడీపీ నేత నారా లోకేష్‌కు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సవాల్ విసిరారు. మండలంలోని కొట్టక్కి గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత ఇంట్లో శుభకార్యానికి గురువారం ఎమ్మెల్యే హాజరై, ఆ తర్వాత మీడియాతో కాసేపు మాట్లాడారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ పాలన జరిగితే నేడు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. అవినీతి రహిత పాలనపై సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి నీకు గానీ, మీ నాయకులకు గానీ లేదన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన మీ నాన్న చంద్రబాబు ఎంత అవినీతికి పాల్పడ్డారో, ఇటీవల ఆయన జైలుకు వెళ్లిన విషయం చెబుతోందన్నారు. కనీస రాజకీయ పరిజ్ఞానం లేని దద్దమ్మవైన నీకు వైఎస్సార్ సీపీ నేతలను విమర్శించే అర్హత లేదన్నారు. కనీసం వార్డు మెంబరుగా కూడా గెలవలేని నువ్వు మాయమాటలు చెప్పుకుంటూ తిరగడం, ఆ మాటలకు వెనక్కి ఉన్న టీడీపీ నాయకులు సైతం భజన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కనీస నాయకత్వ లక్షణాలు లేని లోకేష్ సభల్లో మతిస్థిమితం లేనట్లుగా ఆడిన మాటలు విని, జనం నవ్వుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు మంత్రి పదవి కోసం ఓట్లు వేసి, గెలిపించిన ప్రజలను మోసం చేసిన రాజులు ఎక్కడ అభివృద్ధి చేశారో చర్చకు రావాలన్నారు. అప్పట్లో ఎన్నికల హడావిడిలో పారాది వంతెనకు, గ్రామాల్లోని రోడ్లకు శిలాఫలకాలు వేశారే తప్ప ఎక్కడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. పెద్దగెడ్డ సాగునీరు రామభద్రపురం మండలానికి తెస్తానని గతంలో మంత్రి హోదాలో సుజయ్‌కృష్ణ రంగారావు పరిశీలించారే గానీ తెచ్చారేంటో ఆయనే చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు పట్టించుకోని టీడీపీ నాయకులు ఎన్నికలొస్తున్నాయని జనాల్లోకి వచ్చి, హామీల పేరుతో జనాన్ని మళ్లీ ఏమార్చేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. టీడీపీ వాళ్ల మాయ మాటలు నమ్మితే ఇప్పుడున్న సంక్షేమ పథకాల్లో ఏ ఒక్కటీ ఉండదన్నారు. మన భవిష్యత్ బాగుండాలన్నా.. ఇప్పుడున్న పథకాలు కొనసాగలన్నా మళ్లీ సీఎం జగన్‌నే ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. ఆయన వెంట బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి ఎస్.వేణుగోపాలనాయుడు, కొట్టక్కి ఎంపీటీసీ ఎస్.రమణమ్మ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, మండల యూత్ అధ్యక్షుడు పి.ఏక్‌నాథ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డి.పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు


నిర్మాణానికి సిద్ధం చేస్తున్న వాసవీనగర్ రోడ్డు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని వాసవీనగర్ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఏఈ పి.వెంకట్ గురువారం తెలిపారు. గురువారం ఆ ప్రాంతానికి వెళ్లిన ఆయన రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశాన్ని పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.5.30 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ నిధులతో త్వరలోనే రోడ్డు నిర్మించి, వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి


లింగాలవలస ఆర్‌బీకే వద్ద ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: రబీ సాగులో భాగంగా రైతులు పండిస్తున్న పంటలకు సంబంధించి, ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని లింగాలవలస, చిన్నశిర్లాం, బూరాడ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను గురువారం సందర్శించిన ఆయన అక్కడి అగ్రికల్చర్ అసిస్టెంట్లు చేస్తున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంటను విక్రయించాలన్నా, ప్రకృతి విపత్తు రీత్యా పంటనష్టం జరిగినా పరిహారం పొందేందుకు ఈకేవైసీ ఉపయోగపడుతుందన్నారు.

సేవారత్నకు ఐదుగురు ఎంపిక

బాడంగి: మండలంలోని ఐదు గ్రామ సచివాలయాల పరిధుల్లోని ఐదుగురు వలంటీర్లు సేవారత్న అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ గొల్లాది గ్రామానికి చెందిన గుర్ల పూర్ణ, డొంకినవలసకు చెందిన చింతల మౌనిక, తెంటువలసకు చెందిన తెంటు మహేశ్వరి, కోటిపల్లికి చెందిన తామాడ అప్పారావు, వీరసాగరానికి చెందిన కొల్లి సింహాచలం ఎంపికైన వారిలో ఉన్నారని, వీరికి ఈ నెల 20వ తేదీన రూ.30 వేలు చొప్పున నగదు బహుమతి అందివ్వడంతో పాటు సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జి, మెడల్ ఇవ్వనున్నారన్నారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లను గుర్తిస్తూ ప్రభుత్వం సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలతో సన్మానిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు వారికి సేవారత్న పురస్కారం లభించినట్లు పేర్కొన్నారు.

20 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం


రంగులద్దుకున్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మించారు. రెండు రోజుల్లో ఈ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర తెలిపారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్మాణం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

కూరగాయల సాగులో తుంపర సేద్యం మేలు


సోపేరులో డ్రిప్ ఇరిగేషన్ సాగును పరిశీలిస్తున్న జిల్లా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ లక్ష్మీనారాయణ

రాజాం: రైతులు వేసవిలో సాగుచేసే కూరగాయల సాగులో తుంపర సేద్యం అనుసరించడం ఎంతో మేలు అని జిల్లా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండలంలోని సోపేరు గ్రామంలో తుంపర సేద్యం నిమిత్తం అందించిన పైపులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి, ఆర్‌బీకే వద్ద గ్రామంలోని రైతులకు రాయితీపై ఇస్తున్న స్ప్రింక్లర్, డ్రిప్ పైపుల పథకాన్ని వివరించారు. నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తుంపర, బిందు సేద్యాలు అవలంబించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

వంగర: మండలంలోని రుషింగిలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంగర, పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం, పాలకొండ మండలాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

మహనీయుడు అంబేడ్కర్

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప మహనీయుడని, ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. మండలంలోని గొల్లాది గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సమసమాజ స్థాపన ధ్యేయంగా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో కృషి చేశారని ఎమ్మెల్యే కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నారని, విజయవాడలో ఆయన భారీ ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆయన ప్రతిష్టను ప్రపంచానికి తెలిసేలా చేశారన్నారు. ప్రతిఒక్కరూ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని, జీవితంలో ఉన్నత స్థానం చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ విగ్రహాన్ని గ్రామానికి చెందిన రాయి శ్రీను అనే వ్యక్తి రూ.45 వేలతో ఏర్పాటు చేయగా, ఆయనను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి మంచి పనులకు అందరూ ఉత్సాహం కనబరచాలన్నారు. అనంతరం అంబేడ్కర్ జీవితచరిత్ర పుస్తకాలను ఆవిష్కరించి, పంచిపెట్టారు. కార్యక్రమంలో మాల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండా రాము, ఉపాధ్యాయుడు బి.రాము, ఎస్.వేణుగోపాలనాయుడు, ఏఐఎం కార్యదర్శి కె.భీమారావు, కె.సురేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బి.వెంకటనాయుడు, దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ సమాధి కావడం ఖాయం

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాజయం పాలై, సమాధి కావడం ఖాయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల జేసీఎస్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లతో గురువారం సమావేశమైన ఆయన 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల సమరంలో 2019 ఎన్నికల్లో కన్నా పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా కృషి చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇక్కడి రాజులు కూడా పోటీ చేయడానికి భయపడేలా ప్రజాతీర్పు రావాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చి, వాటిలో కనీసం ఆరు హామీలు కూడా నేరవేర్చని ఘనచరిత్ర చంద్రబాబుదైతే, ఇచ్చిన హామీల్లో 99 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నవరత్నాల పథకాలకు మించి అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలవలేమని తెలిసిపోయి పలు పార్టీలతో టీడీపీ పొత్తు పెట్టుకుంటోందని, అయినా ఓటమిపాలవ్వడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ నేరుగా ప్రజలతో పొత్తు పెట్టుకుందని 175కి 175 అసెంబ్లీ సీట్లు గెలిచి, ప్రభంజనం సృష్టిస్తుందని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, జిల్లా జేసీఎస్ కన్వీనర్ల చైర్మన్ శంబంగి శ్రీకాంత్, ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, బొబ్బిలి, రామభద్రపురం జేసీఎస్ కన్వీనర్లు టి.దామోదరనాయుడు, చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి


పారంపేటలో పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని పారంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకం నిర్వహణపై ఆరాతీశారు. రుచి, శుచి కలిగిన భోజనం విద్యార్థులకు అందివ్వాలని, నాణ్యమైన విద్యనందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని తెలిపారు. అనంతరం కాగితాపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, మెరుగైన విద్యాబోధనకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

● వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్


తలే రాజేష్‌కు స్వాగతం పలుకుతున్న ఆదర్శనగర్ వాసులు

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక పట్టణంలోని ఆదర్శనగర్, అమ్మవారి కాలనీల్లోని పలు వీధుల్లో గురువారం పర్యటించిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి, ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ప్రజల మౌలిక సదుపాయాలకు సంబంధించిన అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి, పనులు చేయడం జరుగుతోందన్నారు. అలాగే అన్నివర్గాల్లోని ప్రజలకు మేలు జరిగేలా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. రానున్న ఎన్నికల్లోనూ మరోసారి సీఎం జగన్‌ను ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు నాగేంద్ర, ఎ.వెంకటనాయుడు, వి.లక్ష్మణరావు, పి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నోటుపుస్తకాలు, పెన్నుల వితరణ

రేగిడి: మండలంలోని అంబాడ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన వీరాచారి కుమారుడు పుట్టినరోజు సందర్భంగా వీటిని విద్యార్థులకు వితరణ చేశారు. మొత్తం 40 మంది విద్యార్థులకు వీటిని అందించామని దాత తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


బహుమతులతో విద్యార్థులు

రేగిడి: మండలంలోని తాటిపాడు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జీఎంఆర్ ఐటీ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం వలంటీర్లు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి ప్రసాద్ మాట్లాడుతూ ఈ గ్రామంలో తమ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని, వాటిలో చురుగ్గా పాల్గొని, సాయమందించిన పలువురు విద్యార్థులకు ఈ బహుమతులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబూరావు, ప్రధానోపాధ్యాయుడు గార రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడిన 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఇ.శ్రీనివాస్ తెలిపారు. ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై పాలకొండ నుంచి సంకిలి వైపు వీటిని తరలిస్తుండగా, పట్టుకున్నామన్నారు. ఈ ఘటనకు సంబంధించి, నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించిందన్నారు.

క్రీడాకారుడికి జేసీ అభినందన


పవన్‌ను అభినందిస్తున్న జేసీ కార్తీక్

జామి: ఇటీవల నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో అలమండ గ్రామానికి చెందిన పవన్ క్రికెట్‌లో సత్తా చాటడంతో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు దత్తత తీసుకుంది. ఈ నేపథ్యంలో జేసీ కె.కార్తీక్ తన ఛాంబర్‌లో గురువారం పవన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. క్రికెట్‌లో రాణించాలని, జాతీయ జట్టులో స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు.

ఆడపిల్లలను చదివిద్దాం..


అవగాహన కల్పిస్తున్న నాగరాజు బృందం

వేపాడ: మండల కేంద్రం వేపాడలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా గురువారం కళాజాతా నిర్వహించారు. ఆతవ అంబేడ్కర్ నాగరాజు బృందంచే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.కామేశ్వరి నేతృత్వంలో కళాజాతా నిర్వహించారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని, బాలికలను ఉన్నత చదువులు చదివించాలని, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పైడితల్లమ్మకు ప్రత్యేక పూజలు


గజపతినగరం: పూజలందుకుంటున్న పైడితల్లమ్మవారు

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువవీధిలో ఉన్న పైడితల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. రథసప్తమి సందర్భంగా శుక్రవారం గ్రామంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని మాజీ సర్పంచ్ కందుల చిన్నయ్య, కమిటీ సభ్యులు తెలిపారు.


గుర్ల: జగమ్మ పేరంటాలను దర్శించుకుంటున్న భక్తులు

● **గుర్ల:** మండలంలోని పెద్దబంటుపల్లిలో జగమ్మ పేరంటాలు ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకమలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సుమారు రెండు వేల మంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేవీ సూర్యనారాయణరాజు, సర్పంచ్ గెడ్డపు సతీష్, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిబంధనల మేరకు పనులు చేపట్టాలి

బొండపల్లి: నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. మండలంలోని జి.పి.అగ్రహారం గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను తనిఖీ చేశారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు రావాలని, ఒకరికి బదులు మరొకలు పనులకు రావొద్దని సూచించారు. పని ప్రదేశంలో నీడ, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా చూడాలని క్షేత్రసహాయకులకు సూచించారు.

వైభవంగా రామాలయం ప్రారంభోత్సవం


స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


స్వామివారిని దర్శించుకున్న మజ్జి సిరిసహస్ర, జెడ్పీటీసీ శ్రీదేవి

కొత్తవలస: మండలంలోని గులివిందాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు వెలవల లక్ష్మీ శ్రీనివాసరావు, పి.జయసాయికుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం మండల ఆరాధన, అంగ, కరన్యాసాలు, శిఖర ప్రతిష్ట, యంత్రప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చిన్నశ్రీను సోల్జర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ గవర ఇందిరప్రియదర్శిని, గణేష్ దంపతులు ప్రత్యేక పూజాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీలు, వైఎస్సార్‌సీపీ నాయుకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం


పట్టణ పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పారిశుద్ధ్య చర్యలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. స్థానిక పట్టణంలోని కోరాడ వీధి, నాగాశపు వీధి, రాతిపని వీధి, తారాకరామ కాలనీల్లో పర్యావరణ ఇంజినీర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో కలిసి గురువారం పర్యటించిన ఆమె అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణను గమనించి, పరిసరాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలన్నారు. ప్రతిఒక్కరూ ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా ఇంటి వద్దకే వచ్చే చెత్తబండికి చెత్తను అందివ్వాలన్నారు. అనంతరం స్వామి వారి వీధిలోని కన్‌స్ట్రక్షన్ అండ్ డెమోలిస్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను సందర్శించి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆశీల వేలం వాయిదా


వేలంపాటలో పాల్గొన్న వారితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు

రాజాం సిటీ: మున్సిపాలిటీకి సంబంధించి, గురువారం నిర్వహించిన ఆశీల వేలంపాట ఈ నెల 19వ తేదీకి వాయిదా పడింది. ప్రభుత్వం నిర్ణయించిన పాట రూ.34.56 కాగా దీనికి 18 శాతం జీఎస్టీ విధించారు. అయితే ఈ మొత్తం అధికంగా ఉండడంతో వేలం పాడలేమని పాటదారులు అధికారులకు తేల్చిచెప్పారు. మొత్తంలో ఏమైనా తగ్గిస్తే వేలంలో పాల్గొంటామన్నారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహిస్తున్నామని, పాటదారులు కూడా అధిక సంఖ్యలో హాజరుకాకపోవడంతో వేలంను వాయిదా వేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


బస్సు, బైక్ ఢీకొన్న దృశ్యం

రామభద్రపురం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దాసిరెడ్డి శ్రీనివాసరావు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని బూసాయవలసకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు అయిన శ్రీనివాసరావు ఓ పని నిమిత్తం రామభద్రపురానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. సరిగ్గా సాయిబాబా ఆలయం వద్దకు వచ్చేసరికి బాబాను మొక్కుకుందామని ఆలయం వైపు తన వాహనాన్ని తిప్పాడు. ఇంతలో అదే దారిలో వస్తున్న శంకర్ ఫౌండేషన్‌కు చెందిన బస్సు అతడి వాహనాన్ని ఢీకొట్టడంతో ఆయన తలకు బలమైన గాయమైంది. అప్రమత్తమైన స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యానికి విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావు భార్య ఉమామహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేశారు.

రథసప్తమి పూజలకు ఏర్పాట్లు పూర్తి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రి కాలనీలో ఉన్న సూర్యనారాయణ మూర్తి ఆలయంలో రథసప్తమి పూజలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త కొండవేటి వివేకానందరావు గురువారం తెలిపారు.